సాక్షి
నిజామాబాద్
ఆదివారం, 25, ఫిబ్రవరి, 2024



అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం
నగరంలో అసంపూర్తిగా నిలిచిన అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు.
- 8లో ▸



జనంలోకి తీసుకెళ్లాలి
సీతారాముల జీవనాన్ని జనంలోకి తీసుకెళ్లాలని సహస్ర అవధాని గరికిపాటి నరసింహరావు సూచించారు.
- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
33.3 /18.7

వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరగవచ్చు. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

రైతులతో ముఖాముఖి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు. చిత్రంలో ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



నిజాం షుగర్స్‌పై ఆశలు

- ఫ్యాక్టరీ పున:ప్రారంభంపై స్పష్టత ఇచ్చిన పునరుద్ధరణ కమిటీ చైర్మన్, మంత్రి శ్రీధర్ బాబు
- కర్మాగారాన్ని సందర్శించిన కమిటీ
- రైతులు, కార్మికులతో సమావేశం
- ఇద్దరు రైతులతోనే మాట్లాడించిన వైనం
- ప్రభుత్వం టేకోవర్ చేస్తుందా.. సహకారం రంగంలో నడుపుతారా అనే దానిపై సందిగ్ధత

బోధన్: నిజాం షుగర్స్ ఫ్యాక్టరీల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పంతో ఉందని ఫ్యాక్టరీల పునరుద్ధరణ కమిటీ చైర్మన్, మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టత ఇవ్వడంతో చెరుకు రైతులు, కార్మికుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అయితే ఫ్యాక్టరీలను ప్రభుత్వం టేకోవర్ చేసుకుని నడిపిస్తుందా.. సహకార రంగంలోనా.. లేక ప్రైవేట్ పరం చేస్తుందా అన్న విషయాలపై మంత్రి స్పష్టత ఇవ్వలేదు. ఈ విషయంలో రైతులు, కార్మికులు అసంతృప్తితో పాటు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో ఫ్యాక్టరీల వాస్తవ పరిస్థితుల అధ్యయనం కోసం వచ్చామని, రైతులు, కార్మికుల అభీష్టమేరకు తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిజాంషుగర్స్ ఫ్యాక్టరీల (మూసివేతకు గురైన బోధన్, ముత్యంపేట, మంబోజిపల్లి) పునరుద్ధరణకు కమిటీ వేసింది. కమిటీ చైర్మన్ అయిన రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కో చైర్మన్, రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహా, కమిటీలోని బోధన్, మెదక్ ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్, మరో నలుగురు రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులు శనివారం తొలిసారిగా బోధన్ షుగర్ ఫ్యాక్టరీ సందర్శనకు వచ్చారు.

200 మంది రైతులు, కార్మికులతో..

రైతు పునరుద్ధరణ కమిటీ ప్రతినిధులు సుమారు రెండు వందల మంది రైతులు, కార్మికులతో సమావేశం నిర్వహించగా అందులో ఇద్దరు రైతులకు మాత్రమే మాట్లాడే అవకాశం కల్పించారు. రైతులు మందర్న రవి, శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ఫ్యాక్టరీ ప్రారంభిస్తే చెరుకు సాగుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

ఫ్యాక్టరీలో సందడి..

పునరుద్ధరణ కమిటీ ప్రతినిధులు, రైతులు, కార్మికులు, నాయకుల రాకగా బోధన్ షుగర్ ఫ్యాక్టరీలో సందడి కనిపించింది. 2015 డిసెంబర్ 23న లేఆఫ్ ప్రకటించి ఫ్యాక్టరీలను యాజమాన్యం మూసివేసింది. నాటి నుంచి ఫ్యాక్టరీ గేట్లు మూసి వేసి ఉన్నాయి. లోపలికి రైతులు, కార్మికులెవరికీ అనుమతి ఇవ్వలేదు. పునరుద్ధరణ కమిటీ రాకతో ఫ్యాక్టరీ గేట్లు తెరిచారు. దీంతో చెరుకు రైతులు, కార్మికులు సంబరపడ్డారు. ఎన్నాళ్లకెన్నాళ్లకు ఫ్యాక్టరీ గేట్లు తెరిచారని చర్చించుకున్నారు.



సమావేశానికి హాజరైన రైతులు, కార్మికులు

చెరుకు సాగుతోపాటు పున:ప్రారంభ ప్రక్రియ

- రైతులు, కార్మికులతో మంత్రి శ్రీధర్‌బాబు

బోధన్: చెరుకు సాగు, నిజాం షుగర్స్ ఫ్యాక్టరీ పున:ప్రారంభ ప్రక్రియలు సమాంతర దశలో కొనసాగాలని ఫ్యాక్టరీ పునరుద్ధరణ కమిటీ చైర్మన్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఫ్యాక్టరీ ఆవరణలో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన రైతులతో నిర్వహించిన ముఖాముఖి సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజాంషుగర్స్ ఫ్యాక్టరీలను తెరిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, రైతుల సహకారంతో లాభాల్లో నడిపించేందుకు కసరత్తు మొదలు పెట్టామన్నారు. ప్రజా ప్రతినిధులు, రైతులు, కార్మికులతో కలిసి ఫ్యాక్టరీ లోపల పరిసరాలను, యంత్రాలను పరిశీలించారు. చెరుకు పండించే రైతులకు పర్చేజ్ ట్యాక్స్, విత్తన రాయితీ, ట్రాన్స్‌పోర్టు సబ్సిడీ, కొత్త వంగడాల పై ప్రభుత్వం దృష్టి సారిస్తుందన్నారు. షుగర్ ఫ్యాక్టరీలు లేఆఫ్‌తో మూతపడి పదేళ్ల కావస్తున్నా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రైతులు, కార్మికుల సంక్షేమం పట్టించుకోలేదని వ్యాఖ్యానించారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీలు, భూములు బ్యాంకుల్లో కుదవ పెట్టారని, బ్యాంక్ రుణాల సమస్యను అధిగమించాల్సి ఉందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ ఖజానా ఖాళీ చేసి పోయిందని ఆరోపించారు. రైతు బంధు విషయం రియల్ స్టేట్ వ్యాపారులకు, గుట్టలకు ఇస్తున్నారని అన్నారు. ఐదు ఎకరాలకే రైతు బంధు సాయం పరిమితం చేయాలని అభిప్రాయాలు పరిశీలనలో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి వ్యతిరేకులకు గేట్లు బంద్ చేశామని, ఇది ప్రభుత్వ నిర్ణయమన్నారు.

సహకార రంగంలో నడిపిస్తామన్న కేసీఆర్

గత టీఆర్ఎస్ (బీఆర్ఎస్) ప్రభుత్వ హయాంలో 2015 జనవరిలో ప్రత్యేకంగా అప్పటి సీఎం కేసీఆర్ మూడు ఫ్యాక్టరీల చెరుకు రైతులతో సమావేశం నిర్వహించారు. రైతులు ముందుకు వస్తే ఫ్యాక్టరీలను ఆధునీకరించి సహకార రంగంలో నడిపేందుకు రైతులకు అప్పగిస్తామని, ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేసీఆర్ స్పష్టత ఇచ్చారు. అయితే రైతులు విభేదించి ప్రభుత్వమే నడపాలని తేల్చి చెప్పారు. గతం నుంచి కూడా షుగర్ ఫ్యాక్టరీలను టేకోవర్ చేసుకుని ప్రభుత్వమే నడపాలని బోధన్ ప్రాంత రైతులు, కార్మికులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ వస్తున్నారు. కాగా కొందరు రైతుల్లో ఫ్యాక్టరీ తెరిపించి ఏ రంగంలోనైనా నడిపించాలనే భిన్నాభిప్రాయం కూడా ఉంది.

చెరుకు విస్తారంగా సాగు చేయాలి



చెరుకు పంటను విస్తారం సాగు చేయాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి రైతులకు సూచించారు. ఏడాదిలో ఆరు నెలల పాటు ఫ్యాక్టరీలో క్రషింగ్ సాగేలా చెరుకు దిగుబడులుండాలన్నారు. ఉత్తరప్రదేశ్ రైతులు కొత్త వంగడాలతో ఎకరానికి 80 టన్నుల దిగుబడి సాధిస్తున్నట్లు చెప్పారు. ఇప్పుడున్న చోటే ఫ్యాక్టరీ ఉండలా లేక కాలుష్య రహిత ప్రాంతానికి మార్చాల అనేదానిపై రైతులు, కార్మికులు అభిప్రాయాలు వెల్లడించాలన్నారు. బోధన్ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు అనువైన ప్రాంతమన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను నెలకొల్పాలని మంత్రి శ్రీధర్‌బాబును కోరారు.

ప్రైవేట్ పరం పెద్ద తప్పిదం



నిజాంషుగర్ ఫ్యాక్టరీల్లో 51 శాతం వాటా ప్రైవేట్ యాజమాన్యానికి అప్పగించడం పెద్ద తప్పిదమని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ఫ్యాక్టరీలను టేకోవర్ చేస్తామని చెప్పి.. మూసివేసిందన్నారు. వరికి ప్రత్యామ్నాయంగా చెరుకు సాగుకు రైతులు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చెరుకు టన్నుకు రూ.4 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుల ఆకాంక్షలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు.

ఫ్యాక్టరీకి పూర్వవైభవం వస్తుంది



కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిజాంషుగర్ ఫ్యాక్టరీలకు పూర్వవైభవం వస్తుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. రైతులు మందర్న రవి, శ్రీనివాస్ రావు మాట్లాడుతు ఫ్యాక్టరీ ప్రారంభిస్తే చెరుకు సాగుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి, మాజీ విప్ ఈరవత్రి అనిల్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఆర్డీవో రాజాగౌడ్, వైస్ పర్సన్ తూము పద్మాశరత్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నాయకులు తాహెర్‌బిన్ హందాన్, పాషా మోహినోద్దీన్, గంగశంకర్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

పిల్లర్ల పనులు పూర్తి



- త్వరలో తెరుచుకోనున్న రైల్వేగేట్
- వాహనాల రాకపోకల కోసం అప్రోచ్‌రోడ్డు నిర్మాణం

నిజామాబాద్ రూరల్: మాధవనగర్ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా చేపట్టిన పిల్లర్ల పనులు పూర్తయ్యాయి. పనులు కొనసాగుతుండడంతో గత నెలరోజులుగా రైల్వే గేటును మూసివేశారు. దీంతో వాహనదారులు బైపాస్ మీదుగా రాకపోకలు సాగించారు. ప్రస్తుతం పిల్లర్ల పనులు పూర్తికావడంతో నిర్ణయించిన తేదీకంటే వారం రోజుల ముందే రైల్వే గేటును తెరుస్తామని రైల్వే అధికారులు అంటున్నారు. పిల్లర్ల పక్క నుంచి వాహనాల రాకపోకల కోసం అప్రోచ్ రోడ్డు పనులు చేపడుతున్నారు. పిల్లర్ల పనులు పూర్తికావడం, అప్రోచ్ రోడ్డు వేస్తుండడంతో తమకు తిరిగి వెళ్లే బాధ తప్పుతుందని వాహనదారులు అంటున్నారు. రైల్వే గేటు తెరిచినప్పటికీ పనులకు అడ్డంకులు ఏర్పడకుండా ఉండేందుకు భారీ వాహనాల రాకపోకలను అనుమతించే అవకాశం ఉండదు. బైపాస్ మీదుగానే భారీ వాహనాలు వెళ్లాల్సి ఉంటుంది.

అప్రోచ్ రోడ్డు వేస్తున్నాం

మాకున్న ఆదేశాల ప్రకారం ఇప్పటి వరకు రైల్వే ఓవర్ బ్రిడ్జి పనుల్లో భాగంగా పిల్లర్ల పని పూర్తయ్యింది. పిల్లర్ల వెంబడి అప్రోచ్ రోడ్డును నిర్మిస్తున్నాం. వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా రోడ్డును వేస్తున్నాం. పనులు పూర్తి దశకు చేరుకున్నాయి.

– మహేశ్‌బాబు, ఆర్‌వోబీ సైట్ ఇంజినీర్

ఐటీఐలకు మహర్దశ!

- అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం
- కొత్త ట్రేడ్‌లు ప్రవేశపెట్టాలని ఆదేశం

నిజామాబాద్ అర్బన్: ప్రభుత్వ ఐటీఐ(పారిశ్రామిక శిక్షణ సంస్థ)లకు మంచి రోజులు రానున్నాయి. ఐటీఐలను అప్‌గ్రేడ్ చేయాలని ఇటీవల ప్రభుత్వం నిర్ణయించింది. డిమాండ్ ఉన్న కోర్సులను ప్రవేశపెట్టి విద్యార్థులకు ఉపాధి కల్పించేలా చూస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. జిల్లాలో మొత్తం ఐదు ప్రభుత్వ ఐటీఐలు ఉన్నాయి. నిజామాబాద్ నగరంలో బాలికలు, బాలుర ఐటీఐ కళాశాలలతో పాటు బోధన్, కమ్మర్‌పల్లి, భీమ్‌గల్‌లో ఐటీఐలు ఉన్నాయి. వీటిలో మొత్తం 1,884 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఆయా కాలేజీలను అప్‌గ్రేడ్ చేసేందుకు సంబంధిత అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ప్రస్తుతం ఐటీఐలు నామమాత్రంగానే కొనసాగుతున్నాయి. సిబ్బంది, బోధకుల కొరత తీవ్రంగా వేధిస్తుంది. ముఖ్యంగా నిర్వహణకు నిధులు లేవు. ట్రేడ్లకు సంబంధించి పరికరాలు యంత్రాలు లేక ఉన్నవాటితోనే నెట్టుకొస్తున్నారు. భవిష్యత్తు తరాలకు అవసరమైన ట్రేడ్లు అందుబాటులో లేవు. ఈ సమస్యను తీర్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.



బాలికల ఐటీఐలో కుట్లు శిక్షణ నేర్చుకుంటున్న విద్యార్థినులు

తొలి విడతలో రెండు కాలేజీలు

నిజామాబాద్ బాలుర ఐటీఐలో 596 సీట్లు ఉన్నాయి. ఇందులో ఫిట్టర్, టర్నర్, ఎలక్ట్రీషియన్, కంప్యూటర్ మెకానిక్, వెహికల్ మెకానిక్, సివిల్, డీజిల్ మెకానిక్, వెల్డర్, స్టెనొగ్రఫీ, కట్టింగ్ అండ్ సీవింగ్ ట్రేడ్లు ఉన్నాయి. బాలికల ఐటీఐలో 448 సీట్లు ఉండగా ఇందులో కొత్తగా సోలార్ టెక్నీషియన్, టెక్నీషియన్ స్మార్ట్ హెల్త్ కేర్ ట్రేడ్లను ప్రవేశపెట్టారు. వీటితో పాటు డ్రెస్ మేకింగ్, స్టెనోగ్రఫీ, మెకానిక్ డీజిల్, ఎలక్ట్రీషియన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. నగరంలోని ఈ రెండు కాలేజీల్లో సీట్లు ఎక్కువగా ఉండటంతో తొలి విడతలో వీటిని అప్‌గ్రేడ్ చేయనున్నారు. దీనికి సంబంధించి అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.

నూతన కోర్సులకు అనుమతి

ప్రభుత్వం టాటా కంపెనీతో కలిసి ఐటీఐలను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం డిమాండ్ ఉన్న కోర్సులను ప్రవేశపెట్టి యువతకు ఉపాధి కల్పించాలని భావిస్తోంది. డ్రోన్ల నిర్వహణ, ఎలక్ట్రికల్ వాహనాలు, భారీ వాహనాల మెకానిక్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో ఉపయోగపడే టెక్నీషియన్లు, మొబైల్, వైద్య రంగంలో ఆధునిక మిషన్ల టెక్నీషియన్ కోర్సులను ప్రవేశ పెట్టాలని నిర్ణయించింది. దీనికోసం ప్రస్తుతం జిల్లాలో ఉన్న ఐటీఐల వివరాలను అధికారులు తీసుకున్నారు. ఆయా కాలేజీల్లో అందుబాటులో ఉన్న స్థలం, మిషన్ల ఏర్పాటుకు ఉన్న సౌకర్యాలపై వివరాలు సేకరించారు.

ప్రతిపాదనలు పంపించాం



ప్రభుత్వం ఇటీవల ఐటీఐలకు సంబంధించి వివరాలను అడిగింది. స్థలం, బోధకులు, బోధనేతర సిబ్బంది పారిశ్రామికంగా ఉన్న వివరాలను పంపించాం. ప్రభుత్వం ఐటీఐలను అప్‌గ్రేడ్ చేసి, నూతన కోర్సులను ప్రవేశపెట్టనుంది. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– కోటిరెడ్డి, ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్

రోడ్డు విస్తరణ సర్వేను అడ్డుకున్న రైతులు

వేల్పూర్: జాతీయ రహదారి విస్తరణ సర్వేను రైతులు అడ్డుకున్నారు. 63వ నంబర్ జాతీయ రహదారిని విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా లక్కోర గ్రామం దాటిన తర్వాత పడగల్ ఒడ్డెర కాలనీ, అంక్సాపూర్, కుకునూర్ గ్రామాల మీదుగా పంట భూముల నుంచి బైపాస్ రోడ్డు వేయాలని హైవే అధికారులు నిర్ణయించారు. రహదారి సర్వే నిర్వహించడానికి శనివారం హైవే పీడీ అజయ్ మణికుమార్, జిల్లా సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు, మండల రెవెన్యూ అధికారులు పంటభూముల వద్దకు రాగా రైతులు వారిని అడ్డుకున్నారు. తమ పంటభూములు రహదారిలో కలిస్తే తాము ఎలా జీవించాలని ప్రశ్నించారు. ఇప్పటికే వరద కాలువ, రైల్వే లైను నిర్మాణానికి భూములు ఇచ్చి నష్టపోయామని, తిరిగి రహదారి విస్తరణకు భూములు కోల్పోవాలా అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం గ్రామాల మీదుగా వెళ్తున్న రహదారిని విస్తరిస్తే నష్టం తక్కువగా ఉంటుందని, అదే పంట భూముల నుంచి నిర్మిస్తే వందల ఎకరాలు నష్టపోతామని ఆందోళన వ్యక్తం చేశారు. విస్తరణలో ఇళ్లు కోల్పోతే తిరిగి నిర్మించుకోవచ్చని, భూములు పోతే దొరుకుతాయా అని ప్రశ్నించారు. అధికారులు బలవంతంగా రోడ్డు నిర్మాణానికి పూనుకుంటే వారి ముందే పురుగుల మందు తాగుతామని డబ్బాలతో నిరసన తెలిపారు. దీంతో అధికారులు వెనుదిరిగారు.



పురుగుల మందు డబ్బాలతో నిరసన తెలుపుతున్న రైతులు

న్యూస్‌రీల్

చట్టం పరిధిలో పనిచేయాలి



ఖలీల్‌వాడి: వీడీసీలు చట్టం పరిధిలో పని చేయాలని జిల్లా జడ్జి సునీత కుంచాల, సీపీ కల్మేశ్వర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని డీఎల్ఎస్ఏ కార్యాలయంలో గ్రామ అభివృద్ధి కమిటీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వీడీసీలు చట్టాలకు అనుగుణంగా పనిచేస్తే అన్ని ప్రభుత్వ శాఖల తోడ్పాటు లభిస్తుందని పేర్కొన్నారు. సామాజిక బహిష్కరణలు జీవించే హక్కుకు భంగం కల్గిస్తాయన్నారు. బహిష్కరణలు చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, ఏసీపీ రాజావెంకటరెడ్డి, ఎస్సీ సీఐ శ్రీశైలం, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ యెండల ప్రదీప్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆశ నారాయణ, న్యాయసేవ సంస్థ సూపరింటెండెంట్ పురుషోత్తంగౌడ్ పాల్గొన్నారు.

సారంగాపూర్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలి



ఖలీల్‌వాడి: నిజామాబాద్ సహకార(సారంగాపూర్) చక్కర కర్మాగారాన్ని తెరిపించాలని మంత్రి శ్రీధర్‌బాబుకు సారంగాపూర్ చెరుకు ఉత్పత్తిదారుల సంఘం, ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఆయనను కలిసి ఫ్యాక్టరీని పునరుద్ధరించాలని కోరారు. మంత్రి స్పందించి సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఈ విషయాన్ని అసెంబ్లీలో చర్చించారని మంత్రి చెప్పారు. కార్యక్రమంలో బొడ్డు గంగారెడ్డి, పృథ్వీరాజ్, వేల్పూర్ భూమయ్య, దేశెట్టి సాయరెడ్డి, నాగయ్య, రాధాకిషన్, కృష్ణాగౌడ్, అగ్గు ఎర్రన్న ఉన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



రుద్రూర్: వేసవిలో రోజు వారీగా ఉపాధి పనులకు కూలీల పెంచాలని డీఆర్‌డీవో సాయాగౌడ్ సూచించారు. కోటగిరి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉపాధి హామీ పనులపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు కొత్త పనులను గుర్తించి కూలీలందరికీ పనులు కల్పించాలన్నారు. పని ప్రదేశంలో మంచి నీరు, టెంట్, ఫస్ట్ ఎయిడ్ సౌకర్యం ఉండాలని ఆదేశించారు. ఎంపీడీవో మనోహర్‌రెడ్డి, ఏపీడీ ఓంపాల్, అంబుడ్స్‌మెన్ శ్రీనివాస్, ఈజీఎస్ ఏపీవో గంగారాం పాల్గొన్నారు.

అమ్మకానికి ఆడబిడ్డ

- గమనించి పోలీసులకు అప్పగించిన వైద్యుడు

బాన్సువాడ రూరల్: కన్నపిల్లల్ని పోషించే స్థోమత, బాధ్యత లేని ఓ తండ్రి తన ఏడాది కూతురును అమ్మడానికి సిద్ధపడ్డాడు. ఈ ఘటన బాన్సువాడలోని మాతాశిశు ఆస్పత్రిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. బాన్సువాడ సీఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో ఓ వ్యక్తి తన భుజాలపై ఓ పసి పాపను ఎత్తుకుని అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో గమనించిన ఆస్పత్రిలోని డ్యూటీ డాక్టర్ కాళిదాస్ ఆ వ్యక్తిని ప్రశ్నించాడు. దీంతో అనుమానితుడు తన పేరు విస్లావత్ శ్రీను అని, తనది సంగారెడ్డి జిల్లా సిద్దాపూర్ అని తెలిపాడు. తనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారని, ఏడాది క్రితం తన భార్య చనిపోవడంతో చిన్నారిని పోషించే స్థోమత లేక ఎవరికైనా అమ్మడానికి తెచ్చినట్లు తెలిపాడు. దీంతో వైద్యుడు బాన్సువాడ పోలీసులకు సమాచారం అందించగా వారు శ్రీనును అదుపులోకి తీసుకున్నారు. చిన్నారిని స్త్రీశిశు సంక్షేమ శాఖ అధికారులకు అప్పగించారు. వైద్యుడు కాళిదాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపాడు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి విజ్ఞాన శాస్త్ర ప్రతిభ పరీక్ష



పెర్కిట్(ఆర్మూర్): పెర్కిట్ జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో శనివారం ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆన్‌లైన్‌లో రాష్ట్ర స్థాయి విజ్ఞాన శాస్త్ర ప్రతిభ పరీక్ష నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ఎఫ్‌పీఎస్‌టీ వారు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, ఎఫ్‌పీఎస్‌టీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివ ప్రసాద్, రఘునాథ్, బయో సైన్స్ ఫోరం జిల్లా సభ్యులు గోవర్ధన్, ఎంపీఆర్ చారి, జిల్లా సైన్స్ అధికారి గంగా కిషన్, డివిజన్ అధ్యక్షుడు గంగాధర్, డాక్టర్ పోచన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో గోపికి గోల్డ్‌మెడల్

నిజామాబాద్‌నాగారం: ఇంటర్నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో నిజామాబాద్‌కి చెందిన గోపి మరో గోల్డ్‌మెడల్ సాధించారు. థాయిలాండ్‌లో నిర్వహిస్తున్న ఏషియన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భాగంగా 35 ఏళ్ల పైవయస్సు కేటగిరిలో ఆయన 110 మీటర్ల హార్డిల్స్‌లో ఉత్తమ ప్రతిభ ప్రదర్శించి చాంపియన్‌గా నిలిచారు. జిల్లా సంఘం బాధ్యులు డాక్టర్ శ్రీనునాయక్ ఆయనను అభినందించారు.

ఘనంగా చక్రతీర్థం



డిచ్‌పల్లి: డిచ్‌పల్లి ఖిల్లా రామాలయంలో నిర్వహిస్తున్న సీతారాముల తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం సీతారాముల వన విహారం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకుడు సుమిత్‌శర్మ దేశ్‌పాండే ఆధ్వర్యంలో ఉదయం పూర్ణాహుతి, బలిహరణం, మధ్యాహ్నం గ్రామ శివారులోని మామిడి తోటలో సీతారాముల ఉత్సవ మూర్తులను వన విహారం చేయించారు. వన విహారం సందర్భంగా చక్ర తీర్థం(జాతర), అవభృత స్నానం కార్యక్రమాలను ఘనంగా చేపట్టారు. జాతరలో తినుబండారాలు, ఆట వస్తువుల దుకాణాలు వెలిశాయి. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గజవాడ రాందాస్‌గుప్తా, ఆలయ కమిటీ చైర్మన్ జంగం శాంతయ్య, సర్పంచ్ గడ్డం రాధ కిష్టారెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ గజవాడ జైపాల్, వీడీసీ సభ్యులు తోట చిన్న సాయిలు, వారాల సాయిలు, ఆలయ కమిటీ డైరెక్టర్లు గడ్డం సర్వారెడ్డి, సున్నం పోశెట్టి, సూర మాధురి, ఆనది జితేందర్, భక్తులు పాల్గొన్నారు.

సీతారాముల జీవనాన్ని జనంలోకి తీసుకెళ్లాలి

- సంతృప్తి ఉన్నచోటే సంపద ఉంటుంది: ప్రవచనకారులు, పద్మశ్రీ గరికిపాటి నరసింహారావు
- నగరంలో ఘనంగా 'ధర్మబీజం' కార్యక్రమం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



గరికిపాటి నరసింహారావుకు జ్ఞాపికను అందజేస్తున్న ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్, రాకేశ్‌రెడ్డి



నృత్యం చేస్తున్న విద్యార్థిని

నిజామాబాద్ సిటీ: సీతారాములు, పార్వతిపరమేశ్వరుడితో సమానంగా జీవించగలిగారని, వారికి ఎన్ని కష్టాలు వచ్చిన తట్టుకుని నిలబడ్డారని వీరి జీవనాన్ని జనంలోకి తీసుకెళ్లాలని ప్రముఖ ప్రవచనకారులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత గరికిపాటి నరసింహారావు అన్నారు. నిజామాబాద్‌లోని పాత కలెక్టర్ గ్రౌండ్‌లో శనివారం అర్వింద్ ధర్మపురి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధర్మబీజం(ఏక్ శామ్ శ్రీరామ్ కే నామ్) ఆధ్యాత్మిక కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా గరికిపాటి నరసింహారావు మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతిలో ఒకటే మాట, ఒకటే బాణం, ఒకటే భార్య అన్న రామచంద్రమూర్తి సంస్కృతియే భారతీయ సంస్కృతి అన్నారు. లక్షల యేండ్ల క్రితం వారికి వివాహాలు జరిగి ఎలా కాపురం చేశారో పురాణాలు చదివి తెలుసుకుని మీరు అలా చేయండనే సందేశంతో ప్రతి సంవత్సరం దేవుళ్లకు పెళ్లిళ్లు చేస్తారని తెలిపారు. ప్రతిఇంట్లో పూజ గది ఉండాలని పూజ గదిలేని ఇల్లు స్మశానంతో సమానమన్నారు. ప్రతి హిందువూ ఖచ్చితంగా బొట్టు పెట్టుకోవాలి అది ఏ బొట్టు అయిన సరే. మహిళలు భర్త చనిపోతే బొట్టు పెట్టుకోకపోవటం సరికాదని, మంగళ సూత్రానికి భర్తకు సంబంధం ఉంది గానీ, భర్తకు బొట్టుతో సంబంధం ఉండదన్నారు. సంపదలో కొంత పేదవారికి సాయం చేయాలన్నారు. దేశంలో మహిళలకైనా, పురుషులకైనా శీలమే గొప్ప ఆభరణమన్నారు. ప్రతిఒక్కరూ నిత్యం ఒకగంట పాటు గ్రంథం, పుస్తకాలు చదివితే ఆ ఇల్లు బాగుంటుందన్నారు. సంతృప్తి ఎక్కడ ఉంటుందో అక్కడే సంపద ఉంటుందన్నారు. కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు చేయటంతో అక్కడకు నిత్యం 60వేల మంది పర్యాటకులు వెళ్తున్నారన్నారు. 75ఏళ్ల స్వాతంత్య్రంలో ఏ ప్రధాని ఇంతటి నిర్ణయం తీసుకోలేదని, అది నరేంద్రమోదీతోనే సాధ్యం అయ్యిందన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు..

కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను అలరించాయి. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన కళలను ప్రదర్శించారు. అనంతరం కన్హయ మిట్టల్ ఆలపించిన భజన పాటలకు ప్రజలు నృత్యాలు చేశారు. ఎంపీ ధర్మపురి అర్వింద్, నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులచారి దినేశ్, కార్యక్రమ ఇన్‌చార్జి ఓం దయామ పాల్గొన్నారు.



పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో ప్రవచనాలు వింటున్న భక్తులు

నగరంలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం



మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్ రూరల్: నగరంలో అసంపూర్తిగా నిలిచిన అభివృద్ధి పనులను పూర్తిచేస్తామని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలో 2380 డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు కాగా, అవి అసంపూర్తిగానే ఉన్నాయని బీఆర్ఎస్ పార్టీపై తీవ్రంగా విమర్శించారు. ఇళ్ల అర్హుల ఎంపికలో కూడా అవకతవకలకు పాల్పడినట్లు పేర్కొన్నారు. ఇళ్ల పనులను పునరుద్ధరించడానికి కోటి 25లక్షల రూపాయలను వెంటనే మంజూరు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరామన్నారు. ఈమేరకు జిల్లా మంత్రికి వినతిపత్రం అందించినట్లు పేర్కొన్నారు. అలాగే నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనుల కోసం కేంద్ర ప్రభుత్వం రూ.2.0 కోట్ల నిధులు విడుదల చేసిందని తెలిపారు. అలాగే వాటర్ సప్లయ్ కోసం రూ.217 కోట్ల నిధులు విడుదల చేసిందని, తప్పకుండ ఆ నిధులతో పనులు పూర్తయ్యేలా చూస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. నగరంలో నెలకొన్న సమస్యను పరిష్కరిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను ఎన్నికల కోడ్‌కు ముందు అమలు చేయాలన్నారు. నాయకులు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మాదాసు స్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు నాగోళ్ల లక్ష్మీనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతంకర్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గోపిడి స్రవంతి రెడ్డి, మాస్టర్ శంకర్, పుట్ట వీరేందర్, గడ్డం రాజు, రోషన్‌లాల్ బోర పాల్గొన్నారు.

ప్రభుత్వానికి వారధులు 'మీసేవ' నిర్వాహకులు



నిజామాబాద్‌నాగారం: మీ సేవలు ప్రజలకు ప్రభుత్వానికి వారధులని ఆర్డీవో రాజేందర్ అన్నారు. మీసేవ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో ఆత్మీయ సమ్మేళనాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రజలకు మంచి సేవలు అందించి మన్ననలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మీసేవ ఈడీఎంలు కార్తీక్, అర్జున్, తహసీల్దార్లు అనిరుధ్, నాగార్జున్, బాబూసింగ్, ఎంఎస్‌వో దాస్, జిల్లా మీసేవ అసోసియేషన్ అధ్యక్షుడు చందుపట్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గోనె విశ్వనాథం, సబ్బాని ధర్మానందం, చుక్కల రాజేశ్, పెద్దోళ్ల కిశోర్ గౌడ్, జీవీఆర్, షఫీ హైమద్, బండి రవి, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి వినతుల వెల్లువ



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు



మంత్రితో వామపక్ష పార్టీల నాయకులు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీఎన్జీవోస్ నాయకులు



గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

- నిజాం షుగర్ ఫ్యాక్టరీ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వేడుకోలు

బోధన్‌టౌన్: బోధన్‌లోని నిజాంషుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరుద్ధరణ కమిటీ శనివారం సందర్శించింది. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ హోదాలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల శ్రీధర్‌బాబు, సభ్యులు సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఫ్యాక్టరీని సందర్శించి కార్మికుల సమస్యలను స్వయంగా తెలుసుకొని దరఖాస్తులను స్వీకరించారు. అంతకు ముందు కమిటీ సభ్యులకు మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మావతిరెడ్డి, ఆర్డీవో రాజాగౌడ్, నాయకులు ఘన స్వాగతం పలికారు. మంత్రి వెంట రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జయేశ్ ఉన్నారు.

ఫ్యాక్టరీ సమస్యలు..

నిజాం షుగర్ ఫ్యాక్టరీని పునఃప్రారంభించి కార్మికులను కొనసాగించి, ఫ్యాక్టరీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్మికులు, రైతులు, వామపక్ష సంఘాల నాయకులు మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు.

పెండింగ్ సమస్యలు..

నిజామాబాద్‌నాగారం: ఉద్యోగుల పీఆర్సీ, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీఎన్జీవోస్ నాయకులు జిల్లాకు చేరిన మంత్రి శ్రీధర్‌బాబును ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ అలుక కిషన్, జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, ఉద్యోగులు ఉన్నారు.

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో మంత్రి శ్రీధర్‌బాబును శనివారం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కేశవేణు కలిసి సన్మానించారు. ముందుగా పోలీసుల నుంచి మంత్రి గౌరవ వందనం స్వీకరించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్‌లు మంత్రికి పుష్పగుచ్ఛం అందించారు. మంత్రి శ్రీధర్‌బాబును బ్రాహ్మణ సంక్షేమ సంఘం సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు.

సాగుకు సిద్ధంగా ఉన్నాం



నిజాంషుగర్ ఫ్యాక్టరీని పునఃప్రారంభిస్తే చెరుకు సాగుకు సిద్ధంగా ఉన్నాం. ఫ్యాక్టరీ మూతపడిన నాటి నుంచి ఏళ్లుగా గేటు మూసి వేసి ఉంది. గత ప్రభుత్వం రైతులను మోసం చేసింది.

– మందర్న రవి, చెరుకు రైతు, మందర్న

ఐక్య ఉద్యమాలు చేపట్టాలి



చెరుకు రైతులు, ఫ్యాక్టరీలకు నష్టాలు కలిగేవిధంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అంతర్జాతీయ మార్కెట్ విధానాలపై ఐక్య ఉద్యమాలు చేపట్టాలి. ప్రభుత్వం టన్నుకు రూ.4 వేలు చెల్లించి రైతులను ఆదుకోవాలి.

– వి.ప్రభాకర్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

చెరుకు పంట లాభదాయకం



వరి కంటే చెరుకు పంట లాభదాయకంగా ఉంటుంది. నేను 1982 నుంచి చెరుకు పంట సాగు చేస్తున్నాను. ఎకరానికి 40 నుంచి 50 టన్నుల దిగుబడి వస్తుంది. ఫ్యాక్టరీ ప్రారంభిస్తే రైతులు మేలు కలుగుతుంది.

– శ్రీనివాస్‌రావు, చెరుకు రైతు, నవీపేట

సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు

మాక్లూర్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత అంత్యక్రియలపై ప్రత్యేక శ్రద్ధ వహించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆమె కుటుంబ సభ్యులు శనివారం కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని వల్లభాపూర్‌లో ఉంటున్న నందిత అక్క(పెద్దనాన్న కుమార్తె) పుష్పలత, బావ కాంగ్రెస్ మండల సీనియర్ నాయకుడు దయాకర్‌రావు స్థానిక విలేకరులతో మాట్లాడారు. విపక్ష ఎమ్మెల్యే అయినప్పటికీ అంత్యక్రియలపై శ్రద్ధ వహించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంను కలిసిన మాజీ ఎమ్మెల్సీ

- సొంతగూటికి చేరనున్న రాజేశ్వర్



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్ సొంత గూటికి చేరనున్నారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని శనివారం కలిసి పుష్పగుచ్ఛం అందించారు. నగరానికి చెందిన రాజేశ్వర్ తన రాజకీయ ప్రస్థానాన్ని కాంగ్రెస్ నుంచి ప్రారంభించారు. కౌన్సిలర్ నుంచి ఎమ్మెల్సీగా ఎదిగారు. తిరిగి కాంగ్రెస్‌లో చేరడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అందులో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసినట్లు ప్రచారం జరుగుతోంది. మాజీ మేయర్ బొంతురామ్మోహన్‌రావు, నాయకులు ఉన్నారు.

క్రైం కార్నర్

మొక్కు తీర్చుకునేందుకు వచ్చి మృత్యుఒడికి..

- పోచారం ప్రధానకాలువలో పడి ఒకరి మృతి



నాగిరెడ్డిపేట: మొక్కు తీర్చుకునేందుకు వచ్చిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతిచెందిన ఘటన మండలంలోని గోపాల్‌పేటలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపేట మండలం ఎక్కపల్లికి చెందిన తొర్రి కిషన్(66) గోపాల్‌పేటలో ఉన్న నల్లపోచమ్మ ఆలయంలో మొక్కు తీర్చుకునేందుకు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. కాగా ఆలయ సమీపంలోని పోచారం ప్రధానకాలువ పక్కన వంటలు చేసి భుజించారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లిన కిషన్ కాలువలో పడిపోయాడు. గమనించిన స్థానికులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడి కుమారుడు నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మహిళ మృతి కేసులో ఏడుగురి రిమాండ్

సిరికొండ: మండలంలోని కొండాపూర్‌కు చెందిన పాడెండ్ల లక్ష్మి మృతి కేసులో ఏడుగురిని ఆర్మూర్ కోర్టులో రిమాండ్ చేసినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. లక్ష్మి గ్రామ సమీపంలోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. దర్యాప్తులో భాగంగా పోలీసులు ఆమె ఫోన్‌ను పరిశీలించగా తన ఆత్మహత్యకు గ్రామానికి చెందిన పలువురు కారణమని వాయిస్ రికార్డు చేసింది. వీడియోలో మృతురాలు పేర్కొన్న పాడెండ్ల చిన్న రాజన్న, పాడెండ్ల పెంటయ్య, పాడెండ్ల రమేశ్, బాలగంగారాం, బొడ్డు రాములు, సుబ్బు మేస్త్రీ, గున్నాల చంద్రయ్యపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చోరీ కేసులో ఒకరు..

బీబీపేట: చోరీ కేసులో ఒకరిని రిమాండ్ చేసినట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. వివరాలు.. మండలంలోని యాడారంలో గొబ్బూరి బాపురెడ్డి ఇంట్లో ఈ నెల 19న చోరీ జరిగింది. ఇంట్లో ఎవరు లేని సమయంలో ప్రకాశం జిల్లాకు చెందిన పోకూరి పుల్లయ్య చొరబడి రూ.38 వేలు ఎత్తుకెళ్లాడు. శనివారం యాడారం చౌరస్తాలో పుల్లయ్యను పట్టుకొని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి ద్విచక్ర వాహనం, రూ.రెండు వేలు స్వాధీనం చేసుకొని, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వివాహిత అదృశ్యం

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని సోమర్యాగడి తండాలో వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్ శనివారం తెలిపారు. తండాకు చెందిన బానోత్ కవిత (22) శుక్రవారం రాత్రి తన కూతురితో బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వాహనాల తనిఖీ

ఇందల్వాయి: ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధి లోని పలు ప్రధాన రహదారుల్లో శనివారం పోలీసు లు వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువ పత్రా లు, నంబర్ ప్లేట్లు లేని వాహనాలను పోలీస్ స్టేషన్‌కి తరలించి, యజమానులకు అవగాహన కల్పించినట్లు ఎస్సై మనోజ్ తెలిపారు. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు.

మృత్యువులోనూ వీడని స్నేహబంధం

- చెరువులో పడి ఇద్దరు చిన్నారుల మృతి
- మిన్నంటిన రోదనలు
- గ్రామంలో విషాదఛాయలు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై ఆంజనేయులు



సుతారి శశాంక్(ఫైల్)



మిద్దెల రవీందర్(ఫైల్)

గాంధారి(ఎల్లారెడ్డి): వారు చిన్ననాటి స్నేహితులు ఎక్కడికి వెళ్లినా, ఆడుకున్నా, పాఠశాలకు వెళ్లినా కలిసే వెళ్లేవారు. కాలనీలో సైతం వారి స్నేహబంధాన్ని చూసి అందరూ మురిసిపోయేవారు. అలాంటి వారి స్నేహాన్ని విధి చిన్నచూపు చూసింది. చెరువులో పడి స్నేహితుడు మునిగిపోవడాన్ని గమనించిన మరో మిత్రుడు కాపాడేయత్నంలో అతనూ నీట మునిగి మృతి చెందిన హృదయ విదారకర ఘటన గాంధారి మండలంలోని ముదెల్లిలో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సుతారి శశాంక్(9), మిద్దెల రవీందర్(9) స్నేహితులు. వీరు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. వీరు శనివారం తమ బంధువుల ఇళ్లల్లో శుభకార్యానికి వెళ్లడంతో పాఠశాలకు వెళ్లలేదు. మధ్యాహ్నం గ్రామానికి వచ్చిన శశాంక్, రవీందర్, చెల్లి మనీషా టైరు ఆట ఆడుకుంటూ చెరువు కట్ట వద్దకు వెళ్లారు. రవీందర్ కాలకృత్యాలు తీర్చుకునేందుకు చెరువులోకి వెళ్లగా ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడు. గమనించిన మిత్రుడు శశాంక్ కాపాడే ప్రయత్నం చేసినా అతనూ చెరువులో మునిగి మృతి చెందాడు. చెరువు కట్టపై ఉన్న మనీషా ఈ విషయాన్ని గమనించి తల్లిదండ్రులు, గ్రామస్తులకు తెలిపింది. వెంటనే వారు ఘటన స్థలానికి వెళ్లి చిన్నారులను బయటకు తీశారు. కానీ అప్పటికే వారు మృతి చెందారు. రవీందర్ తండ్రి మిద్దెల రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రైలునుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

ఇందల్వాయి: ఇందల్వాయి-సిర్నాపల్లి రైలు మార్గంలోని నల్లవెల్లి శివారులో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని రైలు నుంచి గుర్తుతెలియని వ్యక్తి పడి మృతి చెందినట్లు ఎస్సై మనోజ్ శనివారం తెలిపారు. రైలు పట్టాలపై మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం మేరకు ఉదయం ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించినట్లు చెప్పారు. ఈ విషయమై రైల్వే పోలీసులకు సమాచారం అందించగా రైల్వే ఎస్సై సాయిరెడ్డి ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వయస్సు సుమారు 45 ఏళ్ల వరకు ఉంటుందని అన్నారు. ఎవరికైనా మృతుడి ఆచూకీ తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

కట్నం కోసం వేధిస్తున్న అత్త, భర్తపై కేసు

రెంజల్: అదనపు కట్నం కోసం భర్తతోపాటు అత్త తనను వేధిస్తున్నారని నీలా గ్రామానికి చెందిన లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. 12 ఏళ్ల క్రితం తాడ్వాయికి చెందిన శ్రీనివాస్‌తో లావణ్యకు వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. ఇటీవల భర్త శ్రీనివాస్, అత్త అదనపు కట్నం కోసం వేధిస్తుండ డంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమో దు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్సై రవికుమార్ తెలిపారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

కమ్మర్‌పల్లి: మండల కేంద్రానికి చెందిన ఓ వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ శనివారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన చౌటి రాజేశ్, లహరి(27) భార్యాభర్తలు. వీరు స్థానిక లక్ష్మీనగర్‌లో నివాసం ఉంటున్నారు. రాజేశ్ ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కి వెళ్లి మూడు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. శనివారం మధ్యాహ్నం రాజేశ్ బయటకు వెళ్లి వచ్చే సరికి లహరి ఇంట్లో ఆత్మహత్య చేసుకుంది. లోపలి నుంచి గడియ ఉండడంతో రాజేశ్ లహరిని ఎంతసేపు పిలిచినా పలకపోవడంతో చుట్టుపక్కల వారి సహాయంతో తలుపులను బద్దులగొట్టి చూడగా లహరి చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేవు. మృతురాలి తల్లి నర్రా సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు..

ఆర్మూర్‌టౌన్: ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఇస్సాపల్లిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గామ్ నవీన్ (32) బతుకుదెరువు కోసం మస్కట్ వెళ్లి ఏడు నెలల క్రితం తిరిగి వచ్చాడు. కుటుంబ ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. గగ్గుపల్లి శివారులోని చెట్టుకు ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా నవీన్ మృతదేహంగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తల్లిదండ్రులు మందలించినందుకు..

మాక్లూర్: ఏ పని చేయకపోతే ఇల్లు ఎలా గడుస్తుందని తల్లిదండ్రులు మందలించినందుకు ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మాక్లూర్ మండలం ఒడ్డెట్‌పల్లిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మచ్చ నిఖిల్(29) ఏ పని చేయకుండా జులాయిగా తిరిగేవాడు. పెళ్లి చేస్తే మార్పు వస్తుందేమోనని తల్లితండ్రులు పది నెలల క్రితం వివాహం జరిపించారు. ప్రస్తుతం నిఖిల్ భార్య గర్భిణి. ఈ క్రమంలో శుక్రవారం పనిపాట లేకుండా తిరిగితే కుటుంబం ఎలా గడుస్తుందని ఇంట్లో గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన నిఖిల్ ఇంట్లో అందరు పడుకున్నాక రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.